# - అంతిమ విజయం -

రచన : శ్రీ చిల్లా సత్యనారాయణ రెడ్డి

'ఆనంద్'

'ఊఁ'

'ఏమిటాలోచిస్తున్నావ్'

'ఏం లేదు'

'నీకో విషయం చెప్పాలి'

'ఏమిటది'

'ఆఁ ఏం లేదనుకో, చెప్పేది సాంతం వినాలికదూ'

'నీకాభయం అక్కర్లేదు'

'సరే నీతో ఎలా చెప్పాలో నాకే అర్థం కావటం లేదు. అయినా నీకు తెలియపర్చడం నా ధర్మం.'

'చెప్పేదేదో సూటిగా చెప్పరాదూ'

'మరేమీలేదు. సుజాతని వివాహమాడబోతున్నాను.'

'అంతా యిదివరకే నిశ్చయమై పోయిందన్నమాట. యింతకీ పార్టీ ఎప్పుడు?'

'పార్టీకేం గాని యీ విషయంలో నీ సహకారం ఎంతైనా నా కవసరం డియర్!'

'ఓహో! అల్లాగా! సహకారం కూడానా! ఓయస్! బై ఆల్ మీన్స్! కాని ఏమిటి ప్రేమ వ్యవహారాల్లో దిగబడ్డావ్! అయినా ప్రేమ గుడ్డిదిలే'...అంటూ ఓరగా చూశాడు.

ఆదికాదు ఆనంద్! ఆమె హృదయ పూర్వకంగా నన్ను ప్రేమిస్తోంది.'

'ప్రేమిస్తోందా! ఓహ్! నీఅంత అదృష్టవంతుడు మరొకడుండబోడు. మన ముఖాలకి ప్రేమ కూడానూ' చాటుగా నవ్వాడు.

'నీకు నవ్వులాటగా వుంది కదూ'

'నవ్వులాట కాకపోతే మరేమిటి రాజా! నువ్వు చేసుకున్న నిర్ణయం సరియైనదేనా?'

'సరైనదనే విశ్వసిస్తున్నాను'

'ఓహో! ఆమె నిన్ను ప్రేమిస్తుందన్నావు కదూ! అందుకు ఆధారం ఏమిటి? అసలేనాడయినా ఆమె నిన్ను కన్నెత్తి చూసిందా?'

'చూడు రాజూ! నిన్ను నువ్వే మభ్యపెట్టుకుంటే లాభంలేదు. ఆమె కళ్ళలోకి సూటిగా చూసే ధైర్యమయినా వుంది నీకు? ప్రేమిస్తున్నానని కలలుకంటూ నిన్ను నువ్వే వంచించుకుంటున్నావు కదూ? యీ సంగతి నిన్ను కాదు నీ హృదయాన్నడిగితే చెబుతుంది. యిందులో మళ్ళా సహకారం కావాలేం?'— వ్యంగ్యంగా నవ్వుతూ చూశాడు.

రాజు బాధగా ముఖం పక్కకి తిప్పుకున్నాడు.

'నీకు అర్థంకాదు ఆనంద్! అనుకోకుండా కలిగిన మా పరిచయం మమ్మల్నింత సన్నిహితుల్ని చేసింది. తొలి చూపులోనే ఆమె నన్నింతగా ఆకర్షించిందంటే నీవు నమ్మకపోవచ్చు. నా హృదయంలోని ప్రేమకు ఆమె ప్రతిబింబం! ఏమైనా సరే ఆమె సాహచర్యాన్ని వదలుకోలేను నేను. ఆమెకోసం ఎటు

వంటి త్యాగాన్ని చెయ్యటానికైనా సిద్ధంగా వున్నాను ఆనంద్! పవిత్రప్రేమకి వుండే విలువ నీకు తెలీదు'

నుదు రెగరేశాడు రాజు.

ఆ మాటలు వింటోన్న ఆనంద్‌కు నవ్వాగ లేదు.

'అవునవును. మాకేం తెలుస్తుంది?'

అయినా యిటు చూడు రాజూ! 'స్త్రీ' అంతర్యం కనిపెట్టగల నేర్పు నీకుందా? నిజం చెప్పు. ఆమె నిన్ను ప్రేమిస్తుందా? ఆమె లోని చేలతనాన్ని ఆధారంగా తీసుకుని, దానికి చిలవలు, పలవలుగా అల్లి నీ చుట్టూ ప్రేమ వలయాన్ని సృష్టించుకుని 'ప్రేమ' అనే భ్రమలోపడి కొట్టుకుంటున్నావు కదూ! అసలు ప్రేమంటే ఏమిటి? ప్రేమంటే అర్థం తెలుసా నీకు? ప్రేమకి పర్యవసానం? వివాహమా? ప్చ్! లాభంలేదు' తల అడ్డంగా తిప్పాడు.

ఏం చెప్పటానికీ తోచక బరువుగా నిట్టూర్చాడు రాజు.

వారిద్దరిమధ్య కొంతసేపు మౌనం రాజ్యం చేసింది.

పశ్చిమాన భానుడస్తంగతుడైనాడు. సంజ వెలుగుని తరుముతూ నిశాతిమిరాలు వెన్నాడు తున్నాయి.

చెట్ల ఆకుల మీదుగా చల్లని గాలి సోకు తూ వారి హృదయాలని గిలిగింతలు పెడు తోంది.

మౌన వ్రతాన్ని భంగ పరుస్తూ...

'అన్నీ ఆలోచించే చేస్తున్నావా?' అనడి గాడు ఆనంద్!

'ఆఁ' అన్నాడు రాజు.

'తొందరబడి చేసుకున్న నిర్ణయాలు అనర్థాలు గొని తెస్తాయని తెలుసుకదూ?'

'వాటి నెదిరించే ధైర్యం నాకుంది'

'సరే. మీ తల్లి దండ్రులకి తెలుసా'

'తెలుసు'

'తెలిసే ఏకీభవించారంటావు'

'ఒకరి యిష్టాయిష్టాలతో నాకు ప్రమేయం లేదు'

'ఎందుచేత'

'చేసుకునే వాడిని నేను గనుక'

'ఓహో! ఒక్కమాట! నీ స్వవిషయంలోకి జోక్యం కలుగజేసుకుంటున్నందుకు ఏమీ అనుకోవు కదా'

'అంత మాత్రాన మన స్నేహ గౌర వాలకు ఎటువంటి అంతరాయమూ కలుగదు'

'గుడ్'

'మీ చెల్లెలి వివాహం గురించి ఆలోచిం చావా?'

'లేదు'

'ఎందుకని'

'యిప్పట్లో...అని పూర్తిచేయక ముందే'

'సరే! నీవిలా ఆదర్శ వివాహానికి తలపడితే బాగానే వుంటుంది మరి, కాని నీచెల్లెలి వివా హం ఎలా జరుగుతుందనుకున్నావు? కుల గౌరవం, వంశప్రతిష్ఠ మంటగలిసిపోయి నందుకు, కృంగిపోయే తల్లిదండ్రుల గుండెల మీదికి యీ సమస్యకూడా తీసుకొస్తావా? వేలకు వేలుపోసి అయినా గౌరవమైన సంబం ధాన్ని పొందలేం? కదా! అటువంటప్పుడు

కని, పెంచి, పెద్ద చేసిన తల్లిదండ్రులకి ఎంత బాధగా వుంటుంది? ఆలోచించు! నీ ఒక్కడి మూలాన ఎందరు బాధపడతారో నీకు తెలుసు. నువ్వు నిజంగా అనుకుంటున్నంత పూర్తిగా యీ సమాజమే మారిపోతే, యీ సమస్యలచే అధిగమించిపోయే వాళ్ళం కాని, నిర్మాణ పథంలోవున్న భవంతిలాంటి యీ అధునాతన సమాజంలో మనం ఏ ఒక్కదానిలోను అనుకున్నంత సుళువుగా ఫలితాన్ని ఆదర్శవంతంగా పొందలేం. యిది మన బలహీనతే కావచ్చు. కాని, ఏది ఏమైనా వాస్తవానికి ముడిపడని ఆదర్శాలు వల్లించడం కూడా అవివేక మంటాను.' అన్నాడు ఆనంద్.


యింతసేపూ మౌనంగా అతని మాటలు వింటున్న రాజు 'అయితే యిప్పుడేం చెయ్యమంటావు? అదీ నువ్వే చెప్పు' అన్నాడు.

'వాస్తవానికి యిప్పుడు నీ కాళ్ళమీద నిలబడే శక్తి నీకే లేదు. అటువంటప్పుడు సుజాతని వివాహంచేసుకుని మాత్రం నువ్వామెని ఏం సుఖపెట్టగలవు ? చాలీచాలని జీతంతో మీరీ సంసార సాగరాన్నీదగలరా? నామాట విని, నీ కంతగా ఆమెనే చేసుకోవాలని వుంటే, ఆమె అంత అతిప్రధాన వ్యక్తిగా నీకు కనిపించినపుడు నిజమే! నీ వామెనే చేసుకుందువుగాని, అయితే యిక్కడ చిన్న ప్రతిపాదన వుంది. నీ వివాహానికే కొంత వ్యవధి యిస్తూ వాయిదా వేస్తే నీ

అందమునకు
సుఖమునకు
సరియైన కొలత
మంచి నేతకు ....

వీనస్
బనియన్లు ధరించండి!!

ఫోన్ నెం.
235




టెలిగ్రాం :
''వీనస్''

: ఆంధ్ర ఏజెంటు :

యస్. వి. సుబ్బారావు
శ్రీనివాస టెక్స్టైయిల్సు :: పెడన (క్రిష్ణా జిల్లా)

చెల్లెలి సమస్య యీలోగా క్రమంగా పరిష్కరింపబడవచ్చు. ఆ తర్వాత నీ యిష్టప్రకారమే నువ్వు జరపదలచినా నీ తల్లిదండ్రులు అంతగా నీ యిష్టాన్ని బలపరచలేకపోయినా వారికి నచ్చజెప్పి సమర్థనీయమైన ఏర్పాటు చేసే బాధ్యత నాది. తెల్సిందా? యిప్పుడైనా నన్నర్థం చేసుకోగలవనుకుంటాను' అంటూ మందస్మితం చేశాడు ఆనంద్.

రాజు హృదయసీమలో ఆవరించిన అనుమాన మేఘాలు అంతరించి అతని ముఖమండలం అతని భావాల కనుగుణ్యంగా మందస్మితంతో వెలుగందినది.

అవధులు మించిన ఆనందంలో ఆనంద్‌ని గాఢంగా కౌగలించుకున్నాడు. ఆ శుభసమయంలో అతని నోట మాటయే కరువయింది.

క్రమంగా సంజవెలుగు సమసిపోయి ఆకాశ [illegible] చిమ్మచీకట్లు ముసురుకుంటున్నాయి. నిశాబాల ఆగమనాన్ని సూచిస్తూ.

మబ్బుతునకల మధ్యగా చుక్కలు పొదిగిన ఆకాసంమీద తదియచంద్రుడు మసక వెలుగుని గ్రుమరిస్తున్నాడు.

మిత్రులిద్దరూ యింటికి బయల్దేరటానికి ఉద్యమించారు.

తాము కూర్చున్న రాళ్ళగుట్టదాటి, కొంత దూరం వచ్చాక రాజు యిల్లు సమీపించింది.

యిద్దరూ యింట్లోకి ప్రవేశించారు.

టేబిలు మీది నీలిరంగు కవరు వారిని అమితంగా ఆకర్షించింది.

ఆనంద్ కుర్చీలో కూలబడి సిగరెట్ ముట్టించాడు.

రాజు కవరుచించి చదువుకుపోతున్నాడు.

'రాజు గార్కి'—

మీరీ ఉత్తరం చదివాక కూడా నా మీద సదభిప్రాయంకలిగి వుంటారని నే ననుకోను. అయినా సరే యిది నా కర్తవ్యంగా భావించి వ్రాస్తున్నాను

గతాన్ని విస్మరించి, వాస్తవంలో మనం మనగల్గటం ఉభయులకీ శ్రేయస్కరం. నేను మిమ్మల్ని వంచించానని మీరభిప్రాయపడితే నే చేయగలిగింది లేదు కాని, పరిస్థితుల ముందు తలవంచటం ఎవరికైనా తప్పదని మరోసారి ఋజువైనది.

మీ అభిమానానికి భంగపాటు కలిగిస్తే మన్నింపగోరుతూ, మా వివాహానికి తప్పని సరిగా రావలసిందిగా ఆహ్వానపరుస్తూ...

మీ అభిమాన మిత్రురాలు

సుజాత.

ఉత్తరం చదవటంముగించి రాజు భారంగా నిట్టూర్చాడు.

'యీ పీడ యింతటితో విరగడైంది లెమ్మంటూ'.. ఆనంద్ గుక్కలు పట్టి నవ్వ సాగాడు. యిక చేసేది లేక రాజుకూడా అతని నవ్వులో శ్రుతి కలిపాడు. అదే సమయంలో శుభసూచకంగా తన అంతిమ విజయాన్ని ప్రకటిస్తూ గోడ గడియారం ఖంగున మ్రోగింది!